# కాదేదీ శిల్పికనర్హం

**ఓ** చిన్న కథ! ఇది వరకు మనందరికి తెలిసిందే అయినా, మరోసారి చెప్పుకోవలసిన కథ! అనగా అనగా ఓ వూరు. ఆ వూరు నానుకొని చెరువు పక్కనే పెద్ద రావిచెట్టు. ఆ రావి చెట్టుకు, ఆసింటాగా నీలాటి రేవు.

ఓరోజు సాయంకాలం గడ్డం మాసి, అంతకన్నా మాసిన గుడ్డలు కట్టుకున్న ఓ యువకుడు, ఆ రావిచెట్టు కిందకూచుని ఉన్నాడు. అతనలా చాలా సేపట్నించీ కూచునే వున్నాడు. అప్పుడప్పుడు ఊరువేపు, చెరువువేపు, నీలాటి రేవు వేపూ చూస్తున్నాడు.

ఇన్నిటికి అతనెవరు?

ఎందుకలా చూస్తున్నాడు?

ఇక్కణ్ణించే అసలు కథ ప్రారంభమవుతుంది. ఆ దోవనే పోతున్న ఓ దొంగ అతన్ని చూశాడు.

"నాకు మల్లేనే మారు వేషం వేసుకొచ్చాడు. బహుశా ఈ రాత్రికి ఊళ్ళో ఇతగాడు దొంగతనం చేయవచ్చు"ననుకొన్నాడు.

మరో పేద సంసారి అతన్ని చూశాడు. "ఆదాయం తక్కువ, ఖర్చుఎక్కువ, బాకీలవాళ్ళు పీక్కుతింటున్నారు. ఏం చేయడానికి పాలుపోక ఇలా వచ్చారు." అనుకొన్నాడతను.

వో ప్రేమోపాసి చూశాడు "తను ప్రేమించిన అమ్మాయితో పెళ్ళి కాలేదేమో! విరక్తిచెంది వుంటాడు పాపం!" అనుకున్నాడు.

మరో సన్యాసి చూశాడు. "సాంసారిక జీవితం మీద విసుగెత్తి ఉండాలి. పారిపోయివచ్చి ఉంటాడు. ఎవరైతే మాత్రం అంతకన్నా ఏం చేస్తారు గనక?" అనుకున్నాడు.

ఓ జూదరి చూశాడు. "ఉన్నదంతా అయిపోయిందా నాయనా! అదృష్టవంతుడివి. కట్టుగుడ్డలయినా మిగిలాయి నీకు" అనుకొన్నాడు.

ఇలా ఎంత దూరమయినా, ఈ కథను పెంచకుంటూ పోవచ్చు. ఇన్నిటికి అతగాడెవరో మనకు తెలియదు. తెలిసిందల్లా- ఆ వ్యక్తిని గురించి, వారి వారి స్వభావాలుబట్టి వారి వారి ప్రవృత్తులను బట్టే - తమలాంటి వాడే అతగాడూ అనుకోవడం!

ఇది వ్యక్తులకే కాదు, వస్తువులక్కూడా అన్వయిస్తుందనుకొంటే, కాశిం సాహెబుగారు మనకు సులభంగా అర్థమవుతారు. మనకు ఎందుకూ పనికిరాని కొమ్ముల్లో కాశింగారికి రకరకాల బొమ్మలు కనబడతాయి.

"మరీ పుచ్చిపోయినవీ, పొట్లిపోయినవీ తప్పిస్తే అన్ని రకాల కొమ్ములూ పనికొస్తాయండి" అన్నాడు కాశిం, చే రంపంతో కొమ్ము చివర్ని కోస్తూ.

మరి తాత ముత్తాతల సంగతులడిగితే తనకు తెలియదన్నాడు కాశిం. తన తాతను తను చూడనుకూడా చూడలేదన్నాడు. "నాకు మా నాన్న తెలుసునండి. ఆయన వడ్రంగం పనిచేసేవాడు. మా వూళ్లో బ్రహ్మానందంగారని, ఈ వడ్రంగం చేసే ఆయన ఉండేవాడట. వారిదగ్గర మా నాన్న ఈ పని అంటే బొమ్మలు చేయడం కాదు - వడ్రంగం పని నేర్చుకొన్నాడట" అన్నాడు కాశిం. ఆరిపోయిన

బీడిని చెవులోంచి తీసి మళ్ళా వెలిగిస్తూ.

తండ్రి పని నేర్చుకోవడం తెలీదుగానీ పని చేయటం మాత్రం కాశింకు తెలుసు. ''మా నాన్న బళ్ళు చేయడం లోనూ, ఇళ్లు కట్టడంలోనూ మాంచి పని వాడండి! ఒక్కో రోజున పొద్దునే చద్దన్నం తిని, బండి కుండలు, తరిణ పట్టదానికి సంగడి ముందు కూచున్నాడంటే, తిప్పే వాళ్లు అలసిపోవలసిందే తప్ప, ఆయనకు అలుపూ సొలపూ ఉండేది కాదు. మధ్యాన్నానికల్లా రెండుజతల కుండల్నీ చులాగ్గా అవతల పారేసేవాడు'' అన్నాడు కాశిం. అలాంటప్పుడు తను కూడా చక్రం తిప్పుడూ వుండేవాణ్ని అప్పుడప్పుడూ సన్న పొగరుతో, పెచ్చులు కూడా తీస్తూ వుండేవాణ్ని కాశిం అన్నాడు. తన తండ్రి లక్కాకులు మలిచి ఇరుసు బిగిస్తే బండికి వడీ, సుడీ వుండేదే కాదన్నాడు.

ఇళ్లు కట్టడంలో ఆయనకున్న ఆసక్తి ఇంతా అంతా కాదు. ముఖ్యంగా ద్వారబంధాల మీద, లతలు చెక్కడంలో ఆయనకు ఆయనే సాటి. వో తీగ, దానికో చిన్న కొమ్మ చివరన ఆకులు, ఆ ఆకుల మాటున చివుళ్ళు వాటి వొంచనే విడీవిడని మొగ్గలు అద్భుతంగా ఉండేవి.

''ఆయన చేసిన ద్వారబంధాలు బెజవాడలో ఉన్నాయండి! జగ్గయ్య పేటలో వున్నాయి. కావాలంటే మీరెప్పుడన్నా అటు కేసి వెళ్ళినప్పుడు చూసిరండి'' అన్నాడు కాశిం.

ఎంత పనివాడయితే మాత్రం ఏం లాభం? ఇప్పుడా పనివాడితనం ఎవరిక్కావాలి గనక! కాశిం తండ్రి తన చివరి రోజుల్లో దువ్వెనలు, ఈర్పెనలూ చేసుకొని బతికాడు. అప్పుడే కాశిం కూడా ఈ పని నేర్చుకున్నాడు. తండ్రి కొయ్యతో దువ్వెనలు చేస్తే, కాశిం కొమ్ముతో చెయ్యడం ప్రారంభించాడు. కొంత కాలం పాటు ఈ వృత్తి బాగానే సాగింది.

''ఈ ప్లాస్టిక్కు సామాన్లు వొచ్చి, మా పొట్ట కొట్టాయండి. పదిపైసలకు ప్లాస్టిక్కు దువ్వెనొస్తుంటే రూపాయిచ్చి కొమ్ము దువ్వెన ఎవరు బాబూ కొంటారు!'' అన్నాడు కాశిం.

అందుకే, ప్లాస్టిక్ వస్తువులతో అంతగా పోటీలేని ఈ పనిలోకి తను మారానన్నాడు. ''కొమ్ము తిన్నగా వున్నా, వంకరగా వున్నా పనికొస్తుందండీ. వంకరను, మెడదగ్గర తీసుకుంటాను. మిగిలిన కొమ్ముతో పిట్ట శరీరం, తోక చెక్కుతాను. చూస్తున్నారుగా! కొమ్ము ఇలా నిలువుగా వున్నదనుకోండి, కావలసినట్లుగా వొంచుకోవచ్చు... విరగదండీ!'' అని నవ్వాడు కాశిం.

అతని పక్కనే చిన్న కిరోసిన్ దీపం వుంది. ఆ దీపం మీద, కొమ్మును వెచ్చచేసి, కావలసిన మేరకు దాన్ని వొచుతాడు. తరవాత, చేబాడితతో మెల్లిగా చెక్కుతాడు. సన్నసన్న పెచ్చు తీయడానికి జాతి ఉలిని ఉపయోగిస్తారు. షలాక్‌ను, గ్రావర్‌ను కూడా ఉపయోగిస్తానన్నాడు కాశిం.

''వొక్కోసారి బాడిత పనిచేయదండి! పోగరుతో చివ్వుతాను. గ్రావర్‌తో డిజైన్ చెక్కుతాను. సన్న ఆకురాయితో నున్నగా రుద్దతాను. అప్పుడప్పుడు గాజు పెంకులతో కూడా అవసరమైన కొమ్ము భాగాల్ని రుద్ది తీస్తానండీ. సన్నటి పీలికల్ని కళ్లుగా మలుస్తాను. ఇంకో రకంగా పనికిరాని కొమ్ము డొప్పల మీద జిగురుతో అంటిస్తాను.'' అన్నాడు కాశిం.

బొమ్మను బట్టి, కొనేవాణ్ని బట్టి 15 రూపాయల ధర చెబుతాట్ట. 10, 12 రూపాయలకు ఇచ్చేస్తాట్ట. ''అంతకన్నా తక్కువడిగే వారూ వున్నారు. అయినా యివ్వనండి. కూలిగూడా గిట్టకపోతే యెందుకండి వ్యాపారం చేయడం?'' అన్నాడు కాశిం.

అతను కొమ్ముల్ని కిలోల లెక్కన కొంటాడు. కొనేటప్పుడు దుకాణదారుడు ఏరుకోనివ్వడుట. ఒక్కోసారి మరీ పనికిరాని సరుకు వస్తుందట. అలాంటప్పుడు మొత్తం నష్టమేనన్నాడు కాశిం.

"రోజుకు అతికష్టం మీద రెండు బొమ్మలు తయారవుతాయండి. అవి అమ్ముకోవడమే కష్టం. వీటిని రోజూ ఎవరూ కొనుక్కోరూ గదా! ఒకసారి కొన్నారంటే ఏళ్ళపర్యంతం వుంటాయిగదా! అమ్మకాలు లేనప్పుడు, ఏ ఫాన్సీ షాపు వారికో అలవసులవు ధరలకు అమ్ముతుంటాను. పొట్టగడవాలిగా బాబూ!" అన్నాడతను.

ఈ పనిలో కూడా ప్లాస్టిక్కులొస్తున్నాయట. ఆటబొమ్మలు కూడా అచ్చంగా కొమ్ము బొమ్మల్లాగానే ఉంటాయట.

"నాకు ముగ్గురు పిల్లలండి! పెద్దవాణ్ణి ఇరానీ హొటల్లో వుంచా. మా ఆవిడ సేమ్యా కంపెనీలో పనిచేస్తున్నది. అద్దె ఇల్లేనండి. పోలీసుల బాధ. మునిసిపాలిటి వాళ్ళ బాధ..." అని ఆగిపోయాడు కాశిం లుంగీతో కళ్ళొత్తుకొంటూ.